క్లుప్తంగా

ఆత్మకూరు డివిజన్‌లో 171 మి.మీ వర్షపాతం

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గురువారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 171 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. అత్యధికంగా కలువాయి 79.2 మి.మీ, మర్రిపాడు 24.6 మి.మీ, అనంతసాగరం 16.4 మి.మీ, చేజర్ల 14.4 మి.మీ, ఉదయగిరి 12.2 మి.మీ, సంగం 8.4 మి.మీ, ఏఎస్‌పేట 6.2 మి.మీ, ఆత్మకూరు 5.8 మి.మీ, సీతారామపురం 3.8 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

సన్మానం



సీతారామపురం: సీతారామపురం కాంప్లెక్స్ పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గాజులపల్లి బాలకృష్ణారెడ్డి, రవి, ప్రమీలాదేవి, ఏడుకొండలు, జాకీర్‌హుస్సేన్‌ను ఎంఈఓ మస్తాన్‌వలి గురువారం ఘనంగా సత్కరించారు. సీతారామపురం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టంపై పరిశీలన



వరికుంటపాడు: జీ కొండారెడ్డిపల్లిలో వర్షాలకు నేలవాలిన వరి పంటను ఏఓ రవికుమార్ గురువారం పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, వరికంకుల మీద ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

పౌష్టికాహారం పంపిణీ వారాల్లో మార్పు

ఆత్మకూరు: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని ఇకపై ప్రతి నెలా రెండు, నాలుగు శుక్రవారాల్లో అందజేయనున్నట్లు ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీఓ రత్నమ్మ గురువారం తెలిపారు. ఆత్మకూరు ప్రాజెక్ట్ పరిధిలోని ఆత్మకూరు, ఏఎస్‌పేట, సంగం, చేజర్ల మండలాల్లోని అంగన్‌వాడీ సెంటర్ల సిబ్బంది ఈ మార్పును గమనించాలని కోరారు.

గిరిజన బాలిక అదృశ్యం

సంగం: కొరిమెర్ల గిరిజన కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలిక అదృశ్యంపై తల్లిదండ్రులు సంగం పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ నెల 28న కూలీ పనులకు వెళ్లిన తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా బాలిక కనిపించలేదు. గ్రామంతో పాటు బంధువుల వద్ద వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు.

బహుమతుల ప్రదానం



సంగం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం బుజ్జయ్య, లైబ్రేరియన్ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



సంగం: వీర్లగుడిపాడుకు చెందిన తాటిబోయిన ప్రసాద్ అనే చిన్నారి కుటుంబానికి ఐక్య ఫౌండేషన్ నిర్వాహకులు గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. చిన్నారి గుండెకు రంధ్రం పడడంతో మెరుగైన వైద్యం చేయించే స్థోమత లేక, కుటుంబ పోషణ జరగక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ గౌరవసలహాదారు మిత్తికాయల పెంచల్‌యాదవ్ తన తల్లి కొండమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారి కుటుంబానికి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఐక్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పయ్యావుల రామకృష్ణచౌదరి, సభ్యులు పయ్యావుల మారుతినాయుడు, ఇండ్ల మహాత్మ, గొడుగులూరి సుమన్, మామూడూరు ప్రతాప్, యర్రగంగు నవీన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల తనిఖీ

వరికుంటపాడు: గ్రామ సచివాలయాల్లో ఆడుదాం ఆంధ్రా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని తోటలచెరువుపల్లి, కాంచెర్వు గ్రామ సచివాలయాలను గురువారం ఆమె సందర్శించారు. రిజిష్టర్లను తనిఖీ చేసి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. సమయాన్ని పాటించాలని సూచించారు. సచివాలయాల పరిధిలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

రైతు పక్షపాతి సీఎం జగన్

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



వింజమూరు: రైతులకు భూహక్కు పట్టాలు అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, ప్రతి విషయంలోనూ రైతులకు ఎంత వరకు మేలు చేయాలనే ఆలోచనే ఆయన అభిమతమని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పేద రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని వింజమూరులోని వీఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ప్రభుత్వం చేయనన్ని మంచి పనులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తోందన్నారు. రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న చుక్కల భూముల సమస్యను సీఎం వైఎస్ జగన్ పరిష్కరించారని తెలిపారు. 20 ఏళ్లకు పైబడి అసైన్డ్ పట్టాలు పొందిన రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ భూములుగా మార్చి రైతుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల మేలు కోసం తపించే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండలంలోని 8,338 మంది రైతులకు 17,151 ఎకరాలకు సంబంధించి భూహక్కు పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం భూహక్కు పట్టాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు, వైస్‌ఎంపీపీ ఆనంగి రమణయ్య, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లాల కొండారెడ్డి, మద్దూరు బాబు, గణపం రమేష్‌రెడ్డి, బండి కృష్ణారెడ్డి, గణపం మురళీరెడ్డి, మద్దూరు బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ సుజన, సొసైటీ డైరెక్టర్లు ఆనంగి రాజేష్, పోలుబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ భూ హక్కు పత్రాలు

అనుమసముద్రంపేట: గత 20 ఏళ్లుగా అసైన్‌మెంట్ భూములు సాగుచేసుకుంటున్న అర్హులైన వారందరికీ భూ హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో అసైన్‌మెంట్ లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఏఎస్‌పేటలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ అసైన్‌మెంట్ లబ్ధిదారులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం భూహక్కు పత్రాలను అందజేస్తుందని తెలిపారు. భూమిలేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. తొలిదశలో మండలంలోని 12 గ్రామాలకు సంబంధించి 750 ఎకరాలను 270 మంది రైతులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండారెడ్డి, జిలానీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు పత్రాలు పంపిణీ

సంగం: మండలంలోని వంగల్లు, మర్రిపాడు గ్రామాల్లోని 37 మంది రైతులకు తహసీల్దార్ నాగరాజు గురువారం పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా అసైన్‌మెంట్ భూములు సాగు చేసుకుంటున్న పేదలకు భూ యాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం పట్టాలు అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

కలిగిరి: రైతుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తూ పలు పథకాలు అమలుచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. కలిగిరిలోని ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో అసైన్‌మెంట్ భూముల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా అసైన్‌మెంట్ భూములు సాగుచేసుకుంటున్న పేదలకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం పట్టాలు అందజేస్తోందని తెలిపారు. భూ హక్కులు కల్పించడంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. జెడ్పీటీసీ పావులూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ సీహెచ్ సుబ్బారెడ్డి, మండల యూత్ కన్వీనర్ కోడూరు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చొరవతో..

ఆత్మకూరు: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో ఆత్మకూరు నియోజకవర్గంలో గత 20 ఏళ్లుగా అసైన్డ్ భూములు సాగుచేసుకుంటున్న 380 మంది రైతులకు 462 ఎకరాలకు సంబంధించి ప్రభుత్వం భూ యాజమాన్య హక్కు పత్రాలను పంపిణీ చేయనుంది. గురువారం ఆత్మకూరు ఆర్డీఓ కే మధులత తన కార్యాలయంలో అసైన్‌మెంట్ లబ్ధిదారులకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. తహసీల్దార్ జగదీష్‌బాబు, ఎంపీపీ కే వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ఆర్డీఓ లబ్ధిదారులకు పట్టాను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అనంతసాగరం మండలంలో 92 మందికి 106.34 ఎకరాలు, మర్రిపాడులో 15 మందికి 23.60 ఎకరాలు, ఆత్మకూరులో 41 మందికి 53 ఎకరాలు, చేజర్లలో 230 మందికి 267.18 ఎకరాలు, ఏఎస్‌పేటలో ఏడుగురికి 11.88 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి భూయాజమాన్య హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

230 మంది రైతులకు పట్టాల పంపిణీ

చేజర్ల: మండలంలో గత 20 ఏళ్లుగా అసైన్‌మెంట్ భూములను సాగుచేసుకుంటున్న 230 మందికి 267.18 ఎకరాలకు సంబంధించి భూయాజమాన్య హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం పట్టాలు అందజేస్తోందని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో భూ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌తో కలిసి ఎంపీపీ తొలి విడతగా యనమదల పంచాయతీ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు భూ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆర్థిక భరోసా కల్పించేలా పట్టాలు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, యనమదల సర్పంచ్ నోటి సుందరరామిరెడ్డి, చేజర్ల సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, వంగవరపు ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

11 మందికి భూ పట్టాల పంపిణీ

అల్లూరు: మండలంలో గత 20 ఏళ్లుగా అసైన్‌మెంట్ భూములు సాగుచేసుకుంటున్న 11 మందికి భూయాజమాన్య హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్‌తో కలిసి గురువారం పేదలకు భూ పట్టాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సాయికుమార్, షేక్ ఉస్మాన్, భక్తవత్సల్ రెడ్డి, భాస్కర్, మునిరాజ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు: భూ పట్టాలను చూపుతున్న లబ్ధిదారులు



చేజర్లలో రైతులకు భూ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ తూమాటి



ఆత్మకూరు: భూ హక్కు పత్రం అందజేస్తున్న ఆర్డీఓ మధులత



ఏఎస్‌పేటలో రైతులకు పట్టాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



సంగం: రైతులకు పట్టాలు అందజేస్తున్న తహసీల్దార్ నాగరాజు



కలిగిరిలో పట్టాలు పంపిణీ చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

యువత ఓటు నమోదు చేసుకోవాలి



ఆత్మకూరు: 18 ఏళ్లు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు సూచించారు. మున్సిపల్ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులకు ఓటు హక్కుపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఓటు హక్కు లేని వారు ఫారం–6 పూర్తి చేసి సచివాలయాల్లో అందజేసి ఓటు హక్కును పొందాలని సూచించారు. మున్సిపల్ ఆర్‌ఐ ఖాసీం, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు



సోమశిల: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు సంక్షేమ ఫలాలు చేరవేస్తున్నారని ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు అనంతసాగరం మండలం ముస్తాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఎంపీటీసీ పార్వతమ్మ, సర్పంచ్ లక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి కృషిపై ధన్యవాదాలు

ఆత్మకూరు నియోజకవర్గ పారిశ్రామికాభివృద్ధి విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించిన ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, బట్రెడ్డి జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆత్మకూరు మండలం నారంపేట సమీపంలోని సెజ్‌ను ఏర్పాటు చేసి తొలి విడతగా అభివృద్ధి పనులు చేయించారని గుర్తుచేశారు. ఆయన హఠాన్మరణంతో ఆత్మకూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన సోదరుడు విక్రమ్‌రెడ్డి పారిశ్రామికాభివృద్ధికి ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయించారని వివరించారు.

వర్షంతో అన్నదాతల్లో హర్షం



వర్షాలకు కావలి పెద్ద చెరువులో చేరిన సాగునీరు



నారుకట్టలతో నాట్లు వేయడానికి సిద్ధమవుతున్న కూలీలు



ముందస్తుగా వేసిన వరి నాట్లు

- చెరువుల్లో చేరుతున్న సాగునీరు
- సాగుకు సమాయత్తమవుతున్న రైతులు

కావలి: గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లో సాగునీరు చేరుతుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువుల కింద సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే నార్లు పోసిన రైతులు నాట్లు వేస్తున్నారు. కావలి నియోజకవర్గంలోని కావలి పట్టణం, కావలి రూరల్, బోగోలు, దగదర్తి మండలాలతో పాటు అల్లూరు మండలంలోని కొంత భాగం రైతులు వర్షాలపై ఆధారపడి వరి సాగుచేపడుతారు. ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాలు ఆలస్యం కావడం.. అక్టోబర్ వరకు వర్షాలు లేకపోడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. అయితే గత నెల మొదటివారంలో అల్పపీడన ప్రభావంతో మొదలైన వర్షాలు అడపాదడపా కురుస్తూనే ఉన్నాయి. దీంతో కావలి నియోజకవర్గంలోని సాగునీటి వనరుల్లో స్వల్పంగా నీరు చేరింది. ఈ నీటిని వినియోగించుకుని రైతులు రబీ సాగుకు సమాయత్తమవుతున్నారు. సాగునీటి వనరులను దృష్టిలో ఉంచుకుని మూడు నుంచి మూడున్నర నెలల్లోపు చేతికందే స్వల్పకాలిక రకాలైన ఆర్‌ఎన్‌ఆర్ 15048, కేఎంఎం 1638, ఎంటీయూ 1010 తదితర రకాల విత్తనాలను కొనుగోలు చేసి నార్లు పోస్తున్నారు. ముందస్తుగా నార్లుపోసిన రైతులు నాట్లు వేయడం ప్రారంభించారు. కావలి నియోజకవర్గంలో రబీలో సుమారు 90వేల ఎకరాల్లో వరి సాగు చేయడానికి రైతులు సమాయత్తమవుతున్నారు. కాగా నియోజకవర్గంలో చెరువులు, గుంటలు, కాలువలు తదితర సాగు నీటి వనరులు 95 వరకు ఉన్నాయి. వీటిలో ప్రస్తుతం కురిసిన వర్షాలకు 1 టీఎంసీల నీరు చేరింది. ఒక టీఎంసీ నీటితో 10వేల ఎకరాల్లో వరి సాగు చేయవచ్చు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాగు నీరు నార్లు పోయడం, నాట్లు వేయడానికి సరిపోతుంది. మిగిలిన మూడు నెలల కాలంలో కనీసం వరి పంటకు 8 టీఎంసీలు నీరు అవసరమవుతుంది. వర్షాలు కురుస్తాయనే ధీమాతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’తో క్రీడా నైపుణ్యం వెలుగులోకి



ఆత్మకూరురూరల్: అప్పారావుపాలెంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తోందని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మండలంలోని బట్టేపాడు, అప్పారావుపాలెం సచివాలయాల్లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను 15 ఏళ్ల పైబడిన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రికెట్, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, తదితర క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులకు అవగాహన కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలు సమకూర్చాలని వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శి బొటక నరసింహులు, వీఆర్‌ఓ బికారి సాహెబ్, వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రాపై అధికారులు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాను సద్వినియోగం చేసుకునేలా యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ భార్గవి, మండల జేసీఎస్ కన్వీనర్ బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచ్ చింతనబోయిన దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు



ఉదయగిరి: సంక్షేమ పథకాల బుక్‌లెట్ల ప్రదర్శన



కొండాపురం: సంక్షేమ డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ



కలిగిరి మండలం నాగసముద్రంలో...

జలదంకి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి తెలిపారు. అన్నవరం సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ సింగయ్య, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సర్పంచ్ మార్తమ్మ, నాయకులు దేవదాస్, రమేష్, ఆలూరు నరసారెడ్డి పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

సోమశిల: కొత్తపల్లి సచివాలయం పరిధిలో రూ.20 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని జేసీఎస్ మండల కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి తెలిపారు. అనంతసాగరం మండలం కొత్తపల్లిలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ మధుసూదన్‌రావు, గ్రామ సచివాలయ కన్వీనర్ కాకూరు సునీత, నాయకులు సూరా నారసింహారెడ్డి, నారసింహారెడ్డి, కృష్ణారెడ్డి, ప్రేమ్‌కుమార్, నాపా యువరాజ్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొండాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర తెలిపారు. గొట్టిగుండాల సచివాలయంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సచివాలయం వద్ద సంక్షేమ, అభివృద్ధి పనులకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీటీసీ వేమిరెడ్డి మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ కొండలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, కమలాకర్, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సుపరిపాలన జగనన్నకే సాధ్యం

ఉదయగిరి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సుపరిపాలన సాగిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కల్లూరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నేలటూరు సచివాలయంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ జెండా ఎగురవేసి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈఓపీఆర్డీ మల్లికార్జున, ఎంఎల్‌ఓ సురేష్, నాయకులు దారపనేని చెన్నయ్య, దారపనేని కేశవులు, ఇత్తడి రమణయ్య, పెండ్యాల సుబ్బారావు, ఇత్తడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: పడమటినాయుడుపల్లిలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు, వైఎస్సార్‌సీపీ జెండాను వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఎంపీడీఓ నాగమణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, ఎంపీటీసీ చిన్నారెడ్డి, నాయకులు రామకృష్ణ, రేవూరు గోపాల్‌రెడ్డి, బాలకొండారెడ్డి పాల్గొన్నారు.

కలిగిరి: నాగసముద్రం సచివాలయంలో నిర్వహించిన ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సర్పంచ్‌లు దమ్ము శ్రీనివాసులు, డేగా శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్లు మూలి రాధాకృష్ణారెడి అక్కెం హజరత్ రెడ్డి, ఎంపీడీఓ జీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంగం: కొరిమెర్ల సచివాలయం పరిధిలో ఏపీకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్‌లు మీరమ్మ, వెంకయ్యనాయుడు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కరిముల్లా, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జలదంకి: వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ



సోమశిల మండలం కొత్తపల్లిలో...



సంగం మండలం కొరిమెర్లలో..



మర్రిపాడు మండలంలో...

ఎంపీడీఓకు సన్మానం



అల్లూరు: ఎంపీడీఓగా శ్రీదేవి అందించిన సేవలు మరువలేనవని జెడ్పీచైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎంపీడీఓ శ్రీదేవి ఉద్యోగ విరమణ సభకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీదేవి శేష జీవితం హాయిగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీడీఓను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, వైస్‌ఎంపీపీ గుమ్మడి సురేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకుడు నీలం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

కలిగిరి: గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించామని కలిగిరి సీఐ ఫిరోజ్ తెలిపారు. గురువారం రాత్రి ఆయన ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డితో కలిసి కృష్ణారెడ్డిపాళెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలయాల్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. ఏఎస్సై సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.